# 15

# అతని మరణమును గూర్చి ఎవరూ దుఃఖించనటువంటి రాజు

## యూదా రాజైన యెహోరాము

## (2 రాజులు 8:16-24)

సమాధి కార్యక్రమాలప్పుడు మనం దుఃఖించుటకు అలవాటు పడ్డాము. అతనికి లేక ఆమెకు తెలిసినవారు ఎవరైనా చనిపోయినట్లయితే, చనిపోయినవారిని గౌరవించుటకు బ్రతికున్న వారిని ఓదార్చుటకు కూడుకొంటారు. స్నేహితులతో బంధువులతో వారి ప్రియమైనవారు మరణించుటను గూర్చి వారి జీవితాలతో దాని ఫలితాన్ని గూర్చి ఆలోచించినప్పుడు సాధారణంగా కళ్ళ నీళ్ళు వస్తాయి.

అయినప్పటికి కొన్ని మరణాలు వెనుక విడిచిపెట్టబడిన వారి కళ్ళవెంట నీళ్ళొచ్చేలా చేయవు.[1] ప్రపంచంలో చాలామంది, అడాల్ఫ్ హిట్లర్ మరణానికో లేక జోసెఫ్ స్టాలిన్ మరణానికో, లేక ఇటీవల కాలంలో మరణించిన సద్దామ్ హుస్సేన్ మరణానికో దుఃఖించి యుంటారని నా అనుమానం. ఈ చారిత్రక వ్యక్తులు చేసిన చెడును బట్టి తరువాత బ్రతికిన వారు దుఃఖించుట కంటె ఎక్కువ సంతోషించి ఉంటారు.

అలాంటి సందర్భాలు ఒక నియమము కాకుండ వినాయింపడ్డాయి. కాబట్టి, బైబిలులో యెహోరాము మరణానికి సంబంధించి “ఎవరికిని ఇష్టములేనివాడై అతడు చనిపోయెను” (2 దినవృత్తాంతములు 21:20), అని చదువుతాము. ఇది మనం కొంచెం ఆగి “ఎందుకు?” అని అడుగునట్లు చేస్తుంది. ఒక రాజు తాను మరణించినప్పుడు ఎవరూ దుఃఖించనంత ఇదిగా ఎలా పరిపాలించాడు?

మంచి రాజైన యెహోషాపాతు ఏడుగురు కుమారులలో యెహోరాము[2] పెద్దవాడు (21:1, 2). యెహోషాపాతు మరణించక ముందు తన వారసుడుగా యెహోషాపాతు పేరు పెట్టాడు, అయితే ఇతర కుమారులకు “వెండి బంగారములు మరియు ప్రశస్త వస్తువులు అనేకములు బహుమానముగా ఇచ్చి, యూదా దేశములో ప్రాకారపట్టణములను వారికిచ్చెను” (21:3). యెహోరాము ఎలా రాజయ్యాడో క్రింది వచనములలో బైబిలు వివరిస్తుంది:

> అహాబు కుమారుడును ఇశ్రాయేలు వారికి రాజునైన యెహోరాము ఏలుబడిలో అయిదవ సంవత్సరమందు యెహోషాపాతు కుమారుడైన యెహోరాము ఏలనారంభించెను.[3] అతడు ఏలనారంభించినప్పుడు ముప్పది రెండేండ్లవాడై యుండి యెరూషలేమందు ఎనిమిది సంవత్సరములు ఏలెను (2 రాజులు 8:16, 17).

యెహోరాము యూదాకు 5వ రాజు. మరియు అతడు సుమారు క్రీ.పూ. 853 నుండి 841 వరకు పరిపాలించాడు. అతడు తన తండ్రి యెహోషాపాతుతో కలిసి రాజ్యపాలన చేసిన తరువాత సింహాసనాన్ని అధిష్టించాడు, మరియు అతని తరువాత అతని కుమారుడు

అహజ్యా రాజయ్యాడు.

బహుశా యెహోరాము గొప్ప సంతోషానందాల మధ్య రాజై ఉంటాడు. క్రొత్త రాజు యొక్క అభిషేకం ఎప్పుడూ గొప్ప ఉత్సవంగా జరుగుతుంది. నిరీక్షణలు ఉన్నతంగా కొనసాగుతాయి. క్రొత్త రాజు పరిపాలనలో భవిష్యత్తు శాంతి సమాధానాలు, అభివృద్ధితో నింపబడుతుందని ప్రజలు ఎదురుచూస్తారు. అయితే యెహోరాము విషయంలో ఆ నిరీక్షణలు వాస్తవ రూపం దాల్చలేదు.

### రాజుగా అతనేమి చేసాడు

క్రొత్త రాజు చేసిన మొట్టమొదటి పని జాతినంతటిని విస్మయానికి గురిచేసి యుంటుంది. తన తండ్రి తనకు రాజ్యాన్నిచ్చి, తన సహోదరులను ఔదార్యముతో చూచాడు. మంచి రాజైన యెహోషాపాతు చేసిన ఏర్పాట్లకు తన కుమారులంతా సంతోషించి ఉంటారని ఒకడాలోచించవచ్చును, కాని యెహోరాము సంతృప్తి చెందలేదు. తన నుండి తన సహోదరులు రాజ్యాన్ని తీసుకొంటారేమో అని అతడు భయపడినట్లు స్పష్టమవుతుంది, కాబట్టి, "యెహోరాము తన తండ్రి రాజ్యమును ఏలనారంభించినప్పుడు తన్ను స్థిరపరచుకొని, తన సహోదరులనందరిని ఇశ్రాయేలీయుల అధిపతులలో కొందరిని హతము చేసెను" (2 దినవృత్తాంతములు 21:4). యెహోరాము పరిపాలన రక్తసంబంధీకుల మరణంతో ప్రారంభమయ్యింది. అతడు తన తోబుట్టువులను చంపాడు. మరియు ఏదో ఒక రాజు తనకు విరోధులవుతారనుకొన్న నాయకులను వధించాడు! దేశం ఎంత భయంకంపితమై ఉంటుంది! మంచి రాజైన యెహోషాపాతు కుమారుడు తన సొంత సహోదరులను చంపేసాడు!

యెహోరాము పాపములకు అతని సహోదరులను చంపటమే ప్రారంభము. "మరియు అతడు యూదా పర్వతములయందు బలిపీఠములను కట్టించి యెరూషలేము కాపురస్తులు దేవుని విసర్జించునట్లు చేసెను. యూదా వారిని విగ్రహ పూజకు లోబరచెను" (2 దినవృత్తాంతములు 21:11) మరియు అతడు "ఇశ్రాయేలీయుల రాజుల మార్గములో నడిచెను" (2 రాజులు 8:18) అని లేఖనాలు మనకు చెబుతున్నాయి. మరో విధంగా, ఉత్తరదేశపు రాజులవలె, అతడు బయలు ఆరాధనను అభ్యసిస్తూ దానిని వ్యాప్తి చెందించాడు. అతడు యూదా రాజులలో మిక్కిలి చెడ్డ వ్యక్తియ్యాడు.

యెహోరాము పాపములను గూర్చి వాటి ఫలితాన్ని గూర్చి ప్రవక్తయైన "ఏలీయా యొద్ద నుండి వచ్చిన పత్రిక" (2 దినవృత్తాంతములు 21:12)[4] వివరిస్తుంది:

> అంతట ప్రవక్తయైన ఏలీయా ఒక పత్రిక వ్రాసి అతనియొద్దకు పంపెను–నీ పితరుడగు దావీదునకు దేవుడైన యెహోవా సెలవిచ్చునదేమనగా – నీవు నీ తండ్రియైన యెహోషాపాతు మార్గములందైనను యూదారాజైన ఆసా మార్గములందైనను నడువక ఇశ్రాయేలు రాజుల మార్గమందు నడచి అహాబు సంతతివారు చేసిన వ్యభిచారముల చొప్పున యూదాను యెరూషలేము కాపురస్థులను వ్యభిచరింపజేసి, నీ కంటె యోగ్యులైన నీ తండ్రి సంతతి వారగు నీ సహోదరులను నీవు చంపియున్నావు. కాబట్టి గొప్ప తెగులుచేత యెహోవా నీ జనులను నీ పిల్లలను నీ భార్యలను నీ వస్తువాహనములన్నిటిని మొత్తును (21:12–14).

## అతడంత చెడ్డ రాజెందుకయ్యాడు

ఎందుకు? అని మనం ఆశ్చర్యపోతాము. యెహోషాపాతు లాంటి నీతిమంతుడైన తండ్రిని కలిగియుండి, యెహోరాము ఎందుకు చెడ్డవాడయ్యాడు? మంచి పురుషులు మంచి స్త్రీల పిల్లలు మంచివారుగానే ఉంటారని ఆలోచించుటకు మనం ఇష్ట పడతాము, అయితే అది ప్రతిసారి జరుగదని బైబిలు మరియు మానవ అనుభవములు రెండూ తెలియజేస్తున్నాయి.

యెహోరాము విషయములో, "ఎందుకు?" అనే ప్రశ్నకు దైవప్రేరిత వృత్తాంతము జవాబిస్తుంది. "ఇంతకు అహాబు కుమార్తెను పెండ్లి చేసుకొని యుండెను గనుక అహాబు కుటుంబీకులవలెనే ఇతడును [యెహోరాము] ఇశ్రాయేలు రాజులు ప్రవర్తించునట్లు ప్రవర్తించుచు యెహోవా దృష్టికి చెడుతనము జరిగించెను" (2 రాజులు 8:18) అని బైబిలు చెబుతుంది. యెహోరాము అంత చెడ్డవాడు ఎందుకయ్యాడు? అతడు అహాబు[5] కుమార్తెను వివాహం చేసుకొన్నాడు కాబట్టి చెడ్డవాడయ్యాడని దైవప్రేరిత గ్రంథకర్త చెబుతున్నాడు. తన చెడ్డ భార్యయైన అతల్యా ప్రభావము మంచి తండ్రియైన యెహోషాపాతు ప్రభావమును మసక బార్చినది. అది తరచూ సంభవిస్తూ ఉంటుంది. భక్తిహీనులైన జీవిత భాగస్వాములు భక్తిపరులైన పురుషుల, స్త్రీల ఆత్మీయ స్థితిని నాశనానికి పాతాళానికి నడిపిస్తారు. "అవిశ్వాసులతో జోడుగ ఉండకుండునట్లు" (2 కొరింథీయులకు 6:14) మనము జాగ్రత్త వహించాలి, అది వివాహ విషయములో కాని లేక మరి ఏ ఇతర దగ్గర సాంఘీక సంబంధాలలోనైనా జాగ్రత్త వహించాలి.

## అతని పాప పరిపాలన నుండి ఏ ఫలితం వచ్చింది

యెహోరాము తన భార్య ద్వారా ప్రభావితుడయ్యాడు, ఇద్దరూ పాపం చేసి యూదా జాతిని పాపంలోనికి నడపించారు. అతని పాపం యొక్క ఫలితమేమిటి? యెహోరాము పాపాలకు ఫలితాలు వచ్చినవని మనం రూఢిగా నమ్మవచ్చును. తమ ప్రజలను పరిపాలించేవారు, తన చట్టానికి విధేయులై న్యాయంగా పరిపాలించాలని దేవుడు అనుకొన్నాడు. దేవుని ప్రజలపై రాజులుగా ఉన్నవారు, దేవుని చిత్తాన్ని నెరవేర్చుటలో తప్పిపోతే, ఏమి జరుగుతుందో, సాక్షికంగానైనా తెలియజేస్తూ పాత నిబంధన చారిత్రిక పుస్తకాలలో వ్రాయబడినది. యెహోరాము విషయములో, 1, 2 రాజులు; 1, 2 దినవృత్తాంతములు ఏమి జరిగిందో ఒక విషయాన్ని చెప్పలేదు కాని పాప ఫలితంగా జరిగిన మూడు విషయాలను చెప్పాయి.

### ఏమి జరుగలేదు: యూదా నాశనం చేయబడలేదు

యెహోరాము పాపముల ఫలితాలను గురించి దైవప్రేరితుడైన చరిత్రకారుడు చెప్పిన మొదటి విషయం ఏమంటే, "అయినను యెహోవా సదాకాలము తన సేవకుడగు దావీదుకును అతని కుమారులకును దీపము నిలిపెదనని మాట ఇచ్చియుండెను గనుక అతని జ్ఞాపకము చేత యూదాను నశింపజేయుటకు ఆయనకు మనస్సు లేకపోయెను" (2 రాజులు 8:19). యూదా ప్రజలు తమ పాపములను బట్టి నాశనమునకు పాత్రులైనట్లు ఈ వచనం మనకు సూచిస్తుంది, అయితే దేవుడు కృప చేత, దావీదుతో చేసిన వాగ్దానముబట్టి ఆ జనాంగాన్ని నాశనం చేయకుండుటకు ఎన్నుకొన్నాడు. ఆ సమయంలో యూదా నాశనం చేయబడకుండుటకు కారణం వారి నీతినిబట్టి కాదు, కాని దేవుడు తన మాటకు నిజాయితగా

ఉండ నిర్ణయించుకొనుటను బట్టే.

**ఏమి జరిగింది: యెహోరాము పాపములు యొక్క ఫలితాలు**

యెహోరాము పాపములను బట్టి యూదా నాశనము చేయబడకుండునట్లు దేవుడెన్నుకొనెనను వాస్తవమునకు అర్థము అతని పాపాలకు ఫలితాలు లేవని కాదు. పాపాలు ఎప్పుడూ ఫలితాలను కలిగి ఉంటాయి. యెహోరాము పాపముల వలన ఏమి జరిగింది?

*జాతీయ ఉపద్రవం.* యెహోరాము పాపాలు జాతి మొత్తానికి చుట్టుకొన్నాయి. అతని తప్పుడు పని వలన యూదాకు ఉపయోగకరమైన దేశాలు ఎదురు తిరిగి స్వతంత్ర్యాన్ని పొందాయి:

> ఇతని [యెహోరాము] దినములలో ఎదోమీయులు యూదా రాజునకు ఇక లోబడుట మాని అతని మీద తిరుగుబాటు చేసి, తమ మీద నొకని రాజుగా నియమించుకొనినందున యెహోరాము తన రథములన్నిటిని తీసుకొనిపోయి జాయీరు అను స్థలమునకు వచ్చి రాత్రి వేళ లేచి తన చుట్టునున్న ఎదోమీయులను రథముల మీది అధిపతులను హతము చేయగా జనులు తమ తమ గుడారములకు పారిపోయిరి. అయితే, నేటి వరకును ఎదోమీయులు తిరుగుబాటు చేసి యూదా వారికి లోబడకయే యున్నారు మరియు ఆ సమయమందు లిబ్నా పట్టణము తిరుగబడెను (2 రాజులు 8:20–22; చూడు 2 దినవృత్తాంతములు 21:8–10).

"యెహోరాము తన తండ్రి దేవుడైన యెహోవాను విసర్జించినందువలన" (2 దినవృత్తాంతములు 21:10), యూదా తనకు పన్ను చెల్లించు రాజ్యాలపై అదుపును కోల్పోయింది. దినవృత్తాంతముల గ్రంథకర్త, ఫిలిష్తీయులు, అరబీయులు యూదాపై దండెత్తి "రాజనగరినందు దొరికిన సమస్త పదార్థములను అతని కుమారులను భార్యలను పట్టుకొని పోయిరి; అతని కుమారులలో కనిష్ఠుడైన యెహోయహాజు తప్ప అతనికి ఒక్క కుమారుడైనను విడువబడలేదు" (2 దినవృత్తాంతములు 21:17) అని తెలియజేసాడు. జాతీయ నాయకుల పాపాలు జాతి మొత్తానికి ఉపద్రవాన్ని తీసుకువస్తాయని బైబిలు పుటలు మరియు చరిత్ర కూడ మనకు బోధిస్తున్నాయి.

*వ్యక్తిగత వ్యాధి మరియు మరణము.* యెహోరాము తన పాపముల వలన జాతి మొత్తాన్ని శ్రమ పొందుటకు నడపటమే కాకుండ, వ్యక్తిగతంగా కూడ శ్రమ పొందాడు. ఏలీయా ఉత్తరములో ప్రవచింపబడిన ప్రకారము (2 దినవృత్తాంతములు 21:12–15), "యెహోవా కుదరచాలని వ్యాధి చేత అతనిని ఉదరమున మొత్తినందున,"[6] రెండు సంవత్సరముల శ్రమ తరువాత "బహు వేదన నొందుచు అతడు మరణమాయెను" (2 దినవృత్తాంతములు 21:18, 19). ఈ రాజు జీవితములో పాపము వ్యాధిని మరణాన్ని కలిగించింది, ఈనాడు కూడ పాపం తరచుగా అలాంటి ఫలితాలనే కలిగిస్తుంది.

*నాశనమైన పిత్రార్జితము.* తరువాత యెహోరాము పాప కార్యములవలన అతని పిత్రార్జితం నాశనమయ్యింది. అతనేదైన యోగ్యమైనది చేసినప్పటికి అది తన పాపముల వలన మరుగు పరచబడినది. అతడు మరణించినప్పుడు, "అతని జనలు అతని పితరులకు చేసిన ఉత్తర క్రియలు అతనికి చేయలేదు"; దానికి బదులు, "ఎవరికిని ఇష్టము లేనివాడై అతడు చనిపోయెను; రాజుల సమాధులలో గాక దావీదు పురమందు వేరు చోట జనులు

అతని పాతిపెట్టిరి" (21:19, 20). ఇతరులకు కూడ అలాంటి అనుభవమే కలిగినది. వారి పాపముల వలన, వారికి వెనుక దుఃఖించువారు లేకుండ చేసుకొని, వారి పాపములను బట్టి మాత్రమే వారిని గుర్తించుకొనునట్లు అవమానకరముగా మరణించారు.

## ముగింపు

ఒక ప్రశ్న మిగిలిపోయంది: నీవు నేను ఎలా గుర్తించుకోబడతాము? మనం పాపములో జీవించినట్లయితే, – మన జీవితాలు ఇతరులను దీవించక శపించినట్లయితే, మన క్రియల ద్వారా ఇతరులకు హాని కలిగించినట్లయితే, మన ప్రవర్తన సమాజాన్ని శపించి, జాతికి అవమానం కలిగించేదిగా ఉన్నట్లయితే, మరియు సంఘానికి సిగ్గుతెచ్చేదిగా ఉన్నట్లయితే – మనం చనిపోయినప్పుడు మనకొరకెవరూ దుఃఖించరు.

మరొక సాధ్యత ఉత్పన్నమవుతుంది. మనం దొర్కా వలె ఉండవచ్చును, ఆమె మరణించినప్పుడు ఆమెతో ఉన్నవారు ఆమె మంచి కార్యాల గురించి సాక్ష్యమిచ్చారు. ఆమెను గురించి అపొస్తలుల కార్యములు, "విధవరాండ్రులందరు వచ్చి యేడ్చుచు, దొర్కా తమతో కూడ ఉన్నప్పుడు కుట్టిన అంగీలును వస్త్రములును చూపుచు అతని యెదుట నిలిచిరి" (అపొస్తలుల కార్యములు 9:39) అని చెబుతుంది. మనం స్తెఫనులా ఉండవచ్చును, సత్యమును బోధించిన శూరుడైన బోధకుడు హతసాక్షిగా మరణించినప్పుడు అతనిని గూర్చి అపొస్తలుల కార్యములు, "భక్తిగల మనుష్యులు స్తెఫనును సమాధి చేసి అతనిని గూర్చి బహుగా ప్రలాపించిరి" (8:2) అని చెబుతుంది. మనమింకా మన ప్రభువైన యేసుక్రీస్తులా ఉండవచ్చును, ఆయన నీతి, దయ, ఉపయోగకరమైన జీవితమును బట్టి, విశ్వాసముతో ఆయనను అనుసరించేవారు ఆయన మరణం పట్ల దుఃఖించారు.

చివరకు, గౌరవముతో మరణించి, ఇతరులు మన మరణం పట్ల దుఃఖించాలనేది మన జీవితములో ప్రాథమిక లక్ష్యం కాకూడదు. దానికంటె, మనం మరణించిన తరువాత నిత్యము దేవునితో జీవించాలనేది మన జీవిత గురి కావాలి. మనం మరణము నుండి లేపబడి ఇంటికి వెళ్లి యేసుతో ఉండాలని కోరుకోవాలి! నీ గురి అదేనా? అదే నీ గురి అయితే, ఆ లక్ష్యాన్ని సాధించే విధంగా నీవు జీవిస్తున్నావా? అలా కాకపోతే, ఈనాడే నీవు నీ జీవితాన్ని దేవునితో సరిచేసుకో.

---

సూచనలు

[1]అలాంటి విషయములో ఒక ఉదాహరణ టామి సౌత్‌లో ఇవ్వబడినది, "Jehoram: A Royal Tragedy," in "Kings of Judah," *Truth for Today* (January 2005): 14లో ఇవ్వబడినది. [2]ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలు రాజు కూడ "యెహోరాము," లేక "యోరాము" పేరు కలిగి ఉన్నాడు. [3]కొన్ని సంవత్సరములు దక్షిణ ఉత్తర రాజ్యాలు రెండూ "యెహోరాము," లేక "యోరాము" పేరుతో పిలువబడ్డాయి. [4]ఈ పాఠం అయిన తరువాత, "యూదా రాజైన యెహోరాముకు ఏలీయా పత్రిక" చూడు. [5]అతల్యాతో యెహోరాము వివాహము యెహోషాపాతు ద్వారా ఏర్పాటు చేయబడినదని మనం గుర్తించుకోవాలి, అతడు దుష్టపాలకులైన అహాబు యెజెబెలు యొక్క కుమార్తెను తన కుమారునికి చేసుకొనుట ద్వారా, వారి బంధుత్వమును ముద్రించి, ఇశ్రాయేలుతో సమధానపడ్డాడు. కనిష్టంగా చెప్పాలంటే, యెహోషాపాతు చుట్టరికము అవివేకమైనది. [6]వ్యాఖ్యాన కర్తలు ఉదరములో తీవ్రమైన వ్యాధి అంటే, అది అతిసార వ్యాధి వలన వచ్చిందని ఊహిస్తారు.

## యూదా రాజైన యెహోరాముకు ఏలీయా యొక్క ఉత్తరం

దక్షిణ రాజ్యమైన యూదా రాజైన యెహోరామునకు ఏలీయా నిజంగా ఉత్తరం పంపించాడా? 2 దినవృత్తాంతములు 21:12–15 అలాంటి పత్రికను కలిగి ఉంది. అది యెహోరాము పాపములను ఖండించి వాటి ఫలితాలను ప్రకటించింది. ఒక దృక్పథం నుండి ఆ వృత్తాంతమును నమ్మకపోవుటకు ఏమీ లేదు. ఉత్తర రాజ్యములో ఏలీయా ప్రవక్తయై యుండగా, దక్షిణ దేశపు రాజుకు తన తప్పును తెలుపుతూ ప్రవక్త శాపగ్రస్తమైన సందేశమును పంపుట అసాధారణం కాదు, అప్పటిలో రెండు రాజ్యాల ప్రవక్తలు ఇతర దేశాలకు విరుద్ధంగా దేవ వాక్యాలు వ్రాయటం జరిగేది, లేక ఆమోసు దక్షిణ రాజ్యాల నుండి ఇశ్రాయేలీయులను ఖండించుటకు ఉత్తర రాజ్యానికి ప్రయాణించాడు. ఇంకా, ఏలీయా "వ్రాసే ప్రవక్త"గా తెలియబడని వాస్తవం, కనీసం ఒకసారైనా అతడు దేవుని వాక్యాన్ని వ్రాసి మాట్లాడి ఉండు సందర్భము ఉండి ఉంటుందను అవకాశమును అడ్డగించదు.

ఏలీయా పత్రికతో ఉన్న ప్రధాన అడ్డంకి, అంతకు ముందే ఏలీయా పరలోకమునకు తీసుకొని పోబడినట్లు బైబిలులో 2 రాజులు 2వ అధ్యాయములో ముందుగానే చెప్పబడినది. భూమి మీద లేనటువంటి ఒక వ్యక్తి జీవించుచున్న ఒక రాజుకు ఎలా పత్రిక వ్రాయగలడు?

ఆ ప్రశ్నకు రెండు అంగీకరింపదగిన జవాబులు చూడవచ్చును. ఒకటి, వాస్తవానికి ఏలీయా ఇంకా జీవించే ఉన్నాడు. రెండవది, దినవృత్తాంతాలు ఏలీయా మార్పు చెందుటను గూర్చి ఏమి చెప్పలేదు. ఈ సంఘటనకు 2 రాజులు ఏ తారీఖు ఇవ్వబడలేదు.[1] భూమిపై నుండి ప్రవక్త ఎడబాటు యెహోరాము పరిపాలన కాలము వరకు జరిగి ఉండదు. మరొక సాధ్యత ఏమంటే, ఏలీయా పరమునకు వెళ్లక ముందు, దైవావేశమువలన యెహోరాము కార్యములను ముందుగా ఎరిగి, పత్రిక వ్రాసి తగిన సమయములో దానిని అతనికి అందించునట్లు ఒకనికి (ఒక వేళ ఎలీషా) ఆజ్ఞాపించి ఉండవచ్చును.[2] రెండు సందర్భాలలో, యెహోరాము ఖచ్చితంగా ఏలీయా నుండి పత్రిక పొందే ఉంటాడు.

---

సూచనలు

[1]Gleason L. Archer, *Encyclopedia of Bible Difficulties* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1982), 226-27. [2]ఈ సాధ్యతను గురించి మరియు యెహోరాము పత్రిక అందుకొనే వరకు ఏలీయా జీవించి యుంటాడనే సాధ్యతను C. F. Keil వివరించాడు. (C. F. Keil and F. Delitzsch, *The Books of the Chronicles,* trans. Andrew Harper, Biblical Commentary on the Old Testament [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., n.d.], 396-400.)